

హే.. కృష్ణా.. నేడు కృష్ణాష్టమి

పుట్టపర్తి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని శనివారం జిల్లా వ్యాప్తంగా వేడుకలు నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆలయాలు ముస్తాబయ్యాయి. బృందావనాల్లో చిన్ని కృష్ణులు సందడి చేయనున్నారు.

ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత శుక్రవారం గరిష్ఠం : 28.0 కనిష్ఠం : 23.0
ANDHRAJYOTHY 5
శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు
శనివారం 16 ఆగస్టు 2025

జిల్లాను అగ్రపథంలో నిలుపుదాం

- 15 శాతం వృద్ధిరేటు లక్ష్యంగా ముందుకు..
- అమరవీరుల త్యాగఫలమే స్వాతంత్ర్యం
- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- పుట్టపర్తిలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం



జాతీయ పతాకానికి గౌరవ వందనం చేస్తున్న మంత్రి సవిత, కలెక్టర్, ఎస్పీ

పుట్టపర్తి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందిస్తూ సుపరిపాలనతో జిల్లాను అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలుపుదామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. పుట్టపర్తిలోని శిరాసాని హిల్స్ పోలీస్ పరేడ్ మైదానంలో శుక్రవారం నిర్వహించిన 79వ స్వాతంత్ర్య దినోత్సవానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆమె జిల్లా ప్రగతి సందేశాన్ని వినిపించారు. ఎందరో అమరవీరుల త్యాగఫలమే నేటి స్వాతంత్ర్యం అన్నారు. ఆ వీరుల స్ఫూర్తితో దేశ, రాష్ట్ర ప్రగతి కోసం సమష్టిగా కృషి చేద్దామని పిలుపు నిచ్చారు. అవినీతి రహితంగా, వివక్ష లేకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రంలో సుపరిపాలన సాగుతోందన్నారు. స్వర్ణాంధ్ర-2047 విజన్‌తో వచ్చే నాలుగేళ్లలో జిల్లాలో ప్రతి ఏడాది



స్వాతంత్ర్య వేడుకల్లో సందేశాన్ని ఇస్తున్న మంత్రి సవిత

15శాతం వృద్ధిరేటు లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. సూపర్ సిక్స్ పథకాలతోపాటు పేదరిక లేని సమాజం, మానవ వనరుల అభివృద్ధి, నీటి సంరక్షణ, వ్యవసాయ, పారిశ్రామికీకరణ, విద్యుత్, ఇంధన తదితర రంగాలలో రాష్ట్రాన్ని అగ్ర గామిగా ఉంచేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. అంతకుమునుపు జిల్లా కలెక్టర్ చేతన్, జిల్లా ఎస్పీ రత్నతో కలిసి పరేడ్‌లో సాయుధ దళాల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం నిర్వహించిన శకటాల ప్రదర్శన, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పోలీస్ జగిలాలతో చేసిన విన్యాసాలు అబ్బురపరిచాయి. ఉత్తమ సేవలు అందించిన జిల్లా, డివిజన్, క్షేత్రస్థాయి ప్రభుత్వ అధికారులకు ప్రశంసా పత్రాలను మంత్రి అందించారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ కుమార్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, జిల్లా స్థాయి అధికార యంత్రాంగం, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు



అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

స్వాతంత్ర్య దినోత్సవంలో భాగంగా విద్యార్థులు నిర్వహించిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. ధర్మవరం జీవనజ్యోతి పాఠశాల, కదిరి గిరిజన సంక్షేమ పాఠశాల, బుక్కపట్నం డైట్ కళాశాల, జగరాజుపల్లి కేజీబీవీ, గోరంట్ల గిరిజన పాఠశాల విద్యార్థుల బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో దేశభక్తిని ఉట్టిపడేలా చేశాయి.



వ్యవసాయ శాఖ శకటానికి మొదటి బహుమతి అందిస్తున్న కలెక్టర్, జేసీ

ఉత్తమ శకటాలకు బహుమతులు

స్వాతంత్ర్య దినోత్సవంలో భాగంగా ప్రదర్శించిన ప్రభుత్వ శాఖల ప్రగతి శకటాలతో పాటు స్టాల్స్ ఆకట్టుకున్నాయి. శకటాల ప్రదర్శనలో వ్యవసాయశాఖకు మొదటి బహుమతి, రెండో బహుమతి అన్నక్యాంటీన్ శకటానికి అందించారు. స్టాల్స్ ప్రదర్శనలో మొదటి బహుమతి ఐసీడీఎస్‌శాఖకు, రెండో బహుమతి అటవీశాఖకు, మూడో బహుమతి పశుసంవర్ధక శాఖకు అందించారు.



జాగిలం ప్రదర్శన..



ఆకట్టుకున్న శకటం



జాగిలాల గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి



స్కౌట్ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మంత్రి



ప్రత్యామ్నాయ విత్తనమేదీ..?

ప్రతిపాదనలతోనే సరిపెట్టిన యంత్రాంగం

జిల్లా అంతటా వర్షం

విత్తనం కోసం రైతుల ఎదురుచూపు



రొద్దంలో కంది సాగు చేస్తున్న రైతన్న

పుట్టపర్తి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): వేరుశనగ సాగుకు అదును దాటిపోయింది. అదునులో చినుకు రాలక సాగు విస్తీర్ణం లక్ష్యానికి చాలా దూరంలో నిలిచిపోయింది. సాగుకు పొలాల్ని దుక్కులు చేసుకున్న రైతన్నకు ప్రత్యామ్నాయమే కనిపిస్తోంది. ఖరీఫ్‌లో సాధారణ విస్తీర్ణం 2,19,893 హెక్టార్లు కాగా ఇప్పటిదాకా 63,226 హెక్టార్లలోనే సాగు చేశారు. వారం రోజులుగా జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తుండడంతో ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారిస్తున్నారు. వ్యవసాయశాఖ ప్రత్యామ్నాయ విత్తనం అవసరమని ప్రతిపాదన చేసి ప్రభుత్వం అనుమతి కోసం ఎదురు చూస్తోంది. సబ్సిడీ విత్తనం ఎప్పుడిస్తారోనని రైతులు ఎదురుచూస్తున్నారు.

లక్ష్యానికి దూరంగా వేరుశనగ సాగు

ఖరీఫ్ సీజన్‌లో జిల్లా సాధారణ సాగు అంచనా 2,19,893 హెక్టార్లుగా వ్యవసాయ శాఖ నిర్ణయించింది. ఇందులో వేరుశనగతోపాటు కంది, మొక్కజొన్న, ఇతర పంటలు 63,226 హెక్టార్లలో సాగు చేశారు. జూన్ మూడో వారం నుంచి వేరుశనగతోపాటు కంది, చిరు ధాన్యాల సాగు ప్రారంభమైంది. సాధారణ విస్తీర్ణం లక్ష్యానికి చాలా దూరంలోనే నిలిచిపోయింది. వేరుశనగ సాధారణ విస్తీర్ణం 1,51,824 హెక్టార్లు కాగా ఇప్పటికి వరకు సాగునీటి, వర్షాధారం కింద కేవలం 35,097 హెక్టార్లు దాటలేక పోతోంది. కంది సాధారణ విస్తీర్ణం 28,925 హెక్టార్లు కాగా 11,586 హెక్టార్లలో సాగయింది. మొక్కజొన్న 17,949 హెక్టార్లకు 8,909 హెక్టార్లు, రాగి 2,935 హెక్టార్లకు 689 హెక్టార్లు, పొద్దుతిరుగుడు 691 హెకార్లకు 5 హెక్టార్లు, వరి 6,396 హెక్టార్లకు 732 హెక్టార్లలో సాగయింది. పత్తి, కొర్ర, తదితర పంటలు కూడా ఆశించినంత స్థాయిలో సాగు కాలేదు. ప్రధానంగా వేరుశనగ సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపినా.. వర్షం కురవకపోవడంతో నిరాశే మిగిల్చింది.

ప్రతిపాదనలతోనే సరి

జూన్, జూలైలో 103 మి.మీ. వర్షపాతం కురవాల్సి ఉండగా.. 57.06 మి.మీ. లోటుతో సాగు ముందుకు వెళ్లలేకపోయింది. ఆగస్టు మొదటి వారం నుంచి జిల్లా అంతటా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో వేరుశనగకు ప్రత్నామ్నాయంగా కంది, ఉలవ, పొద్దుతిరుగుడు, మొక్కజొన్న, అలసంద, పెసలు, రాగి, పత్తితో పాటు చిరుధ్యాన్యాలైనా కొర్ర, అరిక, సజ్జ, సామతోపాటు ఆముదం సబ్సిడీ విత్తనాలు ఇస్తే ప్రయోజనకరంగా ఉంటుందని రైతులు ఆశిస్తున్నారు. జిల్లాలో సబ్సిడీ వేరుశనగతోపాటు కంది, రాగి, మినుముల కిట్లు అరకొరగా ఉచితంగా ఇచ్చారు. అవి సామాన్య రైతులకు అందలేదన్న విమర్శలు ఉన్నాయి. ఎడతెరపిలేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా విత్తనాలైనా సబ్సిడీతో ఇస్తారా లేదా అన్నది స్పష్టత లేదు.

విత్తనాలకు ప్రతిపాదనలు పంపాం

వర్షాధార వేరుశనగ సాగు అదును ముగిసింది. జిల్లాలో 64వేల హెక్టార్లలో ప్రత్యామ్నాయ పంటలకు ఉలవ, అలసంద, పెసర తదితర విత్తనాలు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే సాగు చేసే రైతుకు విత్తనం పంపిణీ చేస్తాం. వేరుశనగకు ప్రత్యామ్నాయంగా పంటల సాగు విస్తీర్ణం లక్ష్యం పెంచే దిశగా ప్రయత్నాలు చేస్తాం.

-సుబ్బారావు, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి

మహిళ మోములో ఆనందం

స్త్రీశక్తి పథకానికి శ్రీకారం

పుట్టపర్తి టౌన్/పెనుకొండ టౌన్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): మహిళలు ఎదురుచూస్తున్న రోజు రానేవచ్చింది. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పిస్తూ స్త్రీ శక్తి పథకానికి శుక్రవారం శ్రీకారం చుట్టారు. ప్రజాప్రతినిధులు, అధికారులు జిల్లావ్యాప్తంగా పండుగలా కార్యక్రమం నిర్వహించారు. దీంతో మహిళ మోములో ఆనందం వెల్లివిరిసంది. పుట్టపర్తిలోని ఆర్టీసీ బస్టాండులో స్త్రీశక్తి పథకం అమలులో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, కలెక్టర్ టీఎస్ చేతన్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డితో కలిసి రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖమంత్రి సవిత జెండా ఊపి, ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం చారిత్రాత్మకం నిర్ణయమన్నారు. తద్వారా మహిళలకు తమ ప్రభుత్వం ఇస్తున్న గౌరవం స్పష్టమవుతుందన్నారు. కలెక్టర్ టీఎస్ చేతన్ మాట్లాడుతూ.. ఈపథకం ద్వారా జిల్లాలో 196 పల్లెవెలుగు, 14 అల్ట్రా పల్లెవెలుగు, 105 ఎక్స్‌ప్రెస్‌లు కలిపి మొత్తం 315 బస్సులను ఉచిత ప్రయా ణం కోసం కేటాయించామన్నారు. ఎమ్మెల్యే సింధూరారెడ్డి మాట్లాడుతూ.. టీడీపీ ఎన్నికలసమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి రాగానే పక్కాగా అమలు చేస్తోందన్నారు. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి మాట్లాడుతూ.. కూట మి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోందన్నారు. అనంతరం మహిళలతో కలిసి బస్సులో ప్రయాణించారు. మంత్రి ఉచిత టిక్కెట్ తీసుకున్నారు. మహిళలకు ఉచిత టిక్కెట్ కూడా ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీఓ సువర్ణ, ఆర్టీసీ ఆర్ఎం మధుసూదన్, డిపో మేనేజర్లు ఇనయతుల్లా, మధు, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సవిత

ఉచిత ప్రయాణ టిక్కెట్ చూపుతున్న మంత్రి సవిత





విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

గురుకులంలో విషజ్వరాలు

హిందూపురం, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): హిందూపురం మండలం మలుగూరువద్ద ఉన్న అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పది మంది విద్యార్థులకు విషజ్వరాలు సోకాయి. వీరిలో నలుగురిని శుక్రవారం 108ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు విషజ్వరాలని చెప్పారు. వారం రోజులుగా విద్యార్థులకు జ్వరాలు వస్తున్నాయన్నారు. విషయం తెలుసుకున్న జేసీ అభిషేక్‌కుమార్, డీఎంహెచ్ఓ ఫైరోజాబేగం గురుకుల పాఠశాలకు వెళ్లి పరిశీలించారు. అందరు విద్యార్థులకు పరీక్షలు చేయాలని జేసీ ఆదేశించారు. వంటగదిని కూడా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో చేరిన వారిలో 8, 9 తరగతులు చదువుతున్న వరుణ్ సందేశ్ నాయక్, తౌసిన్, అకిర, వరుణ్‌కుమార్‌లు ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు.



విద్యార్థులకు చికిత్స చేస్తున్న వైద్యులు

చేయి.. చేయి.. కలిపి..

- పంటకాలువలో పూడికతీత పనులు
- 3 కిలోమీటర్ల మేర కంపచెట్ల తొలగింపు
- ఆదర్శంగా నిలిచిన తిప్పేపల్లి రైతులు



ధర్మవరంరూరల్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): రైతులు చేయి.. చేయి.. కలిపారు. పలుగు, పార పట్టారు. పూడిపోయిన, కంపచెట్లు పెరిగిపోయిన పంట కాలువను శుభ్రం చేశారు. కాలువలో నీరు సాఫీగా వెళ్లేలా చేసి, అందరి మన్ననలు పొందుతున్నారు మండలంలోని తిప్పేపల్లికి చెందిన రైతులు. ధర్మవరం చెరువు కింద గ్రామ పరిధిలో 300 ఎకరాల ఆయకట్టు ఉంది. చెరువు నుంచి నీరు సరఫరా చేసే పంట కాలువలో పూడిక పేరుకుపోయింది. చెట్లు పెరిగిపోయి, నీరు ముందుకు కదలలేని పరిస్థితి నెలకొంది. కాలువను శుభ్రం చేయాలని రైతులు పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదు. తమ సమస్యను తామే పరిష్కరించుకోవాలనుకున్నారు రైతులు. ముందురోజే సమావేశమై చర్చించుకున్నారు. అంతే ఆ మరుసటి రోజే శుక్రవారం పలుగు, పారలు పట్టుకుని పంట కాలువలోకి దిగారు. పూడిక, కంపచెట్లను తొలగించి, కాలువను శుభ్రం చేసుకున్నారు. సుమారు 3కిలోమీటర్ల కాలువలో నీరు పారేందుకు ఇబ్బందులు లేకుండా చేసుకున్నారు.



పంట కాలువలో పూడికతీత పనులు చేస్తున్న తిప్పేపల్లి రైతులు

పురస్కారాల పండుగ

అనంతపురం జిల్లాలో..



మంత్రి కేశవ్ నుంచి అవార్డు అందుకుంటున్న అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రాహర్ | మల్లికార్జున, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ | రామకృష్ణారెడ్డి, ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్ | శ్రీనివాస్, ఆర్డీఓ, గుంతకల్లు | రూపానాయక్, సర్వే ఏడీ | శ్రీనివాసరెడ్డి, ఫైర్ ఆఫీసర్ | శ్రీనివాసయాదవ్, పరిశ్రమల శాఖ జీఎం | సురేఖా రాణి, ఎడీసీసీ బ్యాంక్ సీఈఓ | ప్రసాద్‌బాబు, డీఈఓ | తరుణ్‌కుమార్, పీడీ, ఎన్‌హెచ్ఏఐ | విశ్వనాథరెడ్డి, మైనర్ ఇరిగేషన్, ఎస్ఈ | రమ, జిల్లా గ్రంథాలయ సెక్రటరీ | అరుణకుమారి, డీసీఓ | ఇలియాజ్ బాషా, ఏఎస్పీ | శ్రీనివాసరావు, ఎస్డీపీఓ



వెంకటేశ్వర్లు, ఎస్డీపీఓ | శ్రీనివాసులు, ఎస్డీపీఓ | రవిబాబు, ఎస్డీపీఓ | మహబూబ్ బాషా, డీఎస్పీ | ధరణికిషోర్, ఎస్‌బీ సీఐ | నీలకంఠేశ్వరరెడ్డి, డీఎస్పీ, ఏఆర్ | క్రాంతికుమార్, ఎస్‌బీ సీఐ | హరినాథ్, సీఐ, డీసీఆర్‌బీ | విజయభాస్కర్ గౌడ్, డీసీఆర్‌బీ | శ్రీకాంత్‌యాదవ్, టూటౌన్ సీఐ | వెంకటేష్ నాయక్, ట్రాఫిక్ సీఐ | శేఖర్, అనంతపురం రూరల్ సీఐ | వి.మనోహర్, గుంతకల్లు వన్‌టౌన్ సీఐ | వెంకటరమణ, రాయదుర్గం సీఐ | మహానంది, ఉరవకొండ సీఐ | సాయిప్రసాద్, తాడిపత్రి సీఐ | పవన్‌కుమార్, ఆర్ఐ, ఏఆర్



సాగర్, ఎస్ఐ, నార్పల | వెంకటస్వామి, కసాపురం ఎస్ఐ | జనార్దన్‌నాయుడు, ఉరవకొండ ఎస్ఐ | నాగమధు, కణేకల్లు ఎస్ఐ | భారతి, ఎస్ఐ, అనంతపురం | లోకనాథ్ చౌదరి, ఎస్‌బీ ఎస్ఐ | ప్రవీణ్, ఎస్‌బీ ఎస్ఐ | జఫీర్, ఆర్ఎస్ఐ | మురళీ మోహన్, సీనియర్ అసిస్టెంట్ | గోపీకృష్ణ, డీపీఓ ఆఫీస్ సూపరింటెండెంట్ | శివకుమార్, హెడ్ కానిస్టేబుల్ | తిప్పరాజు, హెడ్ కానిస్టేబుల్ | ప్రసాద్‌రెడ్డి, సీఐ, పీటీసీ | మురళీ కృష్ణ, యోగా మాస్టర్ | వీరేష్ | షారోన్ సోనియా, వైద్య కళాశాల ప్రిన్సిపాల్



ఆత్మారామ్, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ | జయచెన్నారెడ్డి, టీఏ | విశ్వనాథ్‌చౌదరి, సీఐ | కేపీ లింగయ్య, ఏడీఎఫ్ఓ | జయనాథ్‌రెడ్డి, ఎక్సైజ్ సీఐ | జాకీర్ హుస్సేన్, ఎక్సైజ్ ఎస్ఐ | సూర్యనారాయణరెడ్డి, డీపీఆర్ఓ ఆఫీస్ | దామోదర్‌రెడ్డి, డీపీఆర్ఓ ఆఫీస్ | కిరణ్‌బాబు, డీపీఆర్ఓ ఆఫీస్ | వీక్షిత్, ఎంపీ కుమారుడు | దగ్గుపాటి హర్షిత, ఎమ్మెల్యే కుమార్తె | హేమంత్‌కుమార్, సీఐ, | భాస్కర్ నాయుడు, పీసీ

శ్రీ సత్యసాయి జిల్లాలో..



మంత్రి సవిత నుంచి అవార్డు అందుకుంటున్న పట్టుపరిశ్రమ శాఖ అధికారి శోభారాణి | రాజశేఖర్‌రెడ్డి, భూగర్భ జల శాఖ, డీడీ | రాజు, పౌరసరఫరాల శాఖ, డీఎం | ఫైరోజ్‌బేగం, డీఎంహెచ్ఓ | మధుసూదన్, డీసీహెచ్ఎస్ | పద్మావతి, మెప్మా పీడీ | సంజీవయ్య, ఆర్అండ్‌బీ అధికారి | విజయభాస్కర్, ఆర్‌డబ్ల్యూఎస్ | సంపత్‌కుమార్, ఎస్ఈ, ఏపీఎస్పీడీసీఎల్ | వెంకటసుబ్బయ్య, జడ్పీ డిప్యూటీ సీఈఓ | కౌసల్య సాయి ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్



నాగకుమార్ జెడ్ఎం, ఏపీఐఐసీ | నరసింహరాజు, దేవదాయశాఖ | కరుణసాగర్‌రెడ్డి, రవాణా శాఖ అధికారి | కృష్ణకుమారి, జిల్లా రిజిస్ట్రార్ | నరసయ్య, పీడీ, డీఆర్‌డీఏ | శ్రీనివాసులు, ట్రెజరీ అకౌంట్స్ అధికారి | వేణుగోపాల్‌రెడ్డి డీపీఆర్ఓ | మాధవనాయుడు అగ్నిమాపకశాఖ | మధుసూదన్, డీపీటీఓ ఏపీఎస్ఆర్టీసీ | ప్రమీల శిశుసంక్షేమ శాఖ | ప్రమోద్‌కుమార్ కమిషనర్, ధర్మవరం | కిరణ్‌కుమార్ కమిషనర్, కదిరి | క్రాంతికుమార్ కమిషనర్, పుట్టపర్తి

యువకుడి ఆత్మహత్య

● టీడీపీ నాయకుడిపై ఫిర్యాదు



సునీల్ (ఫైల్)

పరిగి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెంకటాద్రి లేఅవుట్ ఎదురుగా షుగర్ ఫ్యాక్టరీ ప్రాంగణంలో శుక్రవారం సునీల్ (25) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ రంగడు యాదవ్ తెలిపిన మేరకు... సునీల్ రొద్దం మండలం మోపర్లపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళతో ఫోన్‌లో మాట్లాడుతుండేవాడు. ఈ విషయాన్ని గ్రామస్థులు పరిగి మండలం విట్టాపల్లిలో ఉన్న ఆ మహిళ బంధువులకు తెలిపారు. దీంతో విట్టాపల్లి గ్రామానికి చెందిన బంధువు ఒకరు పరిగి టీడీపీ నాయకుడు పాళ్యం చంద్రతో కలిసి గురువారం సాయంత్రం 6 గంటల సమయంలో తిరుమల లేఅవుట్‌లో నివసిస్తున్న సునీల్ ఇంటికి వెళ్లారు. అతడిని దుర్భాషలాడుతూ ఖుషి రెస్టారెంట్ వెనుకవైపునకు తీసుకెళ్లారు. ఆ ఇద్దరు వ్యక్తులు కలిసి సునీల్‌పై ఇష్టానుసారంగా దాడిచేశారు. ఈ అవమానం భరించలేకనే అదేరోజు రాత్రి షుగర్ ఫ్యాక్టరీ ప్రాంగణంలో వేపచెట్టుకు తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. మృతుడి తండ్రి నారాయణప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడు కియ పరిశ్రమలో పని చేస్తూ జీవించేవాడు. టీడీపీ నాయకుడు పాల్యం చంద్ర పరారీలో ఉన్నాడు. అతడు దొరికేతే విట్టాపల్లికి చెందిన మరో వ్యక్తి ఎవరన్నది తెలుస్తుందని పోలీసులు పేర్కొన్నారు. కాగా పాళ్యం చంద్రతోపాటు విట్టాపల్లికి చెందిన ఓ వ్యక్తి ఇష్టానుసారంగా కొట్టి, అవమానించడంతోనే తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడు సునీల్ తల్లి దేవి పేర్కొన్నారు.

పల్లె ప్రగతికి పురస్కారాలు


ఢిల్లీలో అందుకున్న నలుగురు సర్పంచ్‌లు



అవార్డు అందుకుంటున్న గొట్లూరు సర్పంచ్ పిట్టా నరసమ్మ

ధర్మవరంరూరల్, ఆగస్టు15(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో ప్రగతికిగాను ఉమ్మడి జిల్లాకు నాలుగు అవార్డులు దక్కాయి. వాటిని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ శుక్రవారం ఢిల్లీలో ప్రదానం చేసింది. ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు వాటిని అందుకున్నారు. ధర్మవరంల మండలం గొట్లూరులో తడి, పొడిచెత్తను వేరువేరుగా సేకరించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో మెరుగైన పనితీరు కనబరచడంతో అవార్డు దక్కింది. సర్పంచ్ పిట్టా నరసమ్మ అవార్డు అందుకున్నారు.

యంగన్నపల్లి సర్పంచ్‌కు..



అవార్డుతో యంగన్నపల్లి సర్పంచ్ భరత్‌కుమార్

గుత్తిరూరల్(ఆంధ్రజ్యోతి): కేంద్రం నిధులను సమర్థవంతంగా వినియోగించడంతో మండలంలోని యంగన్నపల్లికి అవార్డు దక్కింది. దానిని సర్పంచ్ భరత్‌కుమార్ ఢిల్లీలోని ఎర్రకోటలో అందుకున్నారు.

బొందలవాడ సర్పంచ్‌కు..



స్వాతంత్య్ర వేడుకల్లో పాల్గొన్న ఆలం శిరీష దంపతులు

నార్పల (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొందలవాడ గ్రామ పంచాయతీకి అవార్డు దక్కింది. దీంతో ఆ గ్రామ సర్పంచ్ ఆలం శిరీష, ఉప సర్పంచ్ ఆలం వెంకట నరసానాయుడు దంపతులు ఢిల్లీలో అవార్డు అందుకున్నారు. ఈ గుర్తింపు బొందలవాడ గ్రామప్రజలకే దక్కుతుందని వారు పేర్కొన్నారు.



అవార్డు అందుకుంటున్న సర్పంచ్ సీతారాములు

వ్యాసాపురానికి..

ఉరవకొండ(ఆంధ్రజ్యోతి): మండలంలోని వ్యాసాపురం గ్రామ పంచాయతీకి అవార్డు దక్కడంతో సర్పంచ్ సీతారాములు ఢిల్లీలో అందుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో టెకీ మృతి

పెనుకొండ రూరల్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని హరిపురం వైజంక్షన్‌వద్ద 44వ జాతీయరహదారిపై ద్విచక్రవాహనం బోల్తాపడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నావ కృష్ణమూర్తి(35) శుక్రవారం మృతి చెందాడు. కియ ఏఎస్ఐ వెంకటరమణ తెలిపిన మేరకు కళ్యాణదుర్గం మండలం దురదకుంట గ్రామానికి చెందిన నావ కృష్ణమూర్తి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. బెంగళూరు నుంచి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వస్తుండగా హరిపురం వైజంక్షన్ వద్ద అదుపుతప్పి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన కృష్ణమూర్తిని స్థానికులు పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య సుష్మిత ఉన్నారు. తండ్రి నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సౌత్‌జోన్ పోటీల్లో చిత్తూరు, కడప జట్ల గెలుపు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): సీనియర్ మహిళల సౌత్‌జోన్ క్రికెట్ పోటీల్లో కడప, చిత్తూరు జట్లు గెలుపొందాయి. ఆర్డీటీ స్టేడియంలో శుక్రవారం ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ సీనియర్ మహిళల క్రికెట్ పోటీలు నిర్వహించారు. రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో కడప, నెల్లూరు జట్లు తలపడగా మొదట బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు నిర్ణీత 50ఓవర్లలో 9వికెట్లు కోల్పోయి 201 పరుగులు చేసింది. సుహానా 60, జెస్సికా 51పరుగులు చేశారు. కడప బౌలర్ ప్రియాంక 5వికెట్లు పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన కడప 35.2 ఓవర్లలోనే 2వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. వింధ్య భారతి 95పరుగులు సాధించారు. అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో చిత్తూరు, అనంతపురం జట్ల మధ్య జరిగిన పోరులో మొదట బ్యాటింగ్ చేసిన చిత్తూరు నిర్ణీత 50ఓర్లలో 6వికెట్ల నష్టానికి 260పరుగులు చేసింది. బ్యాటర్లు పద్మజ 141 పరుగులు, గ్రీష్మ 37పరుగులు సాధించారు. అనంతరం బరిలోకి దిగిన అనంతపురం ఆరు వికెట్లు కోల్పోయి 132పరుగులు మాత్రమే సాధించి ఓటమిపాలైంది. జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి పోటీలను పర్యవేక్షించారు.

టెక్ జగదీష్

జిల్లా పోలీసు శాఖకు ఎస్పీ డిజిటల్ హంగులు



జిల్లా పోలీస్ శాఖకు అదానీ కంపెనీ ఇస్తున్న సురక్ష వాహనాన్ని అందుకుంటున్న ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోలీసుల పని తీరు మారింది. గ్రామ సీమల్లో ఏదైనా సమస్య వస్తే పోలీసులను ఆశ్రయించే ధైర్యం పల్లె ప్రజలకు వచ్చింది. గతంలో దొంగతనం జరిగినా, మోసపోయినా పోలీస్‌స్టేషన్‌కు ఎందుకు లేబ్బా అనుకుని మౌనంగా ఉండిపోయేవారు. అయితే జిల్లాకు ఎస్పీగా జగదీష్ వచ్చాక పరిస్థితి మారింది. గో బ్యాక్ టు విలేజ్ అంటూ పల్లె ప్రజల చెంతకే పోలీసు సేవలు వెళ్లేలా పని చేస్తున్నారు. ప్రమాదాలు, నేరాలు, చోరీలు జరిగిన తర్వాత నివారణ చర్యలు, రికవరీ చేయడం కంటే క్రైం జరగకుండా చూడటమే లక్ష్యంగా డిజిటల్ పోలీసింగ్‌తో ప్రజల్లో చైతన్యం నింపేందుకు నడుంబిగించారు. ప్రజలకు నేరాల పట్ల అవగాహన కల్పించడం కోసం ఎసురక్షే అనే సరికొత్త కార్యక్రమం చేపట్టారు. దీని గురించి గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సరికొత్త టెక్నాలజీని వాడుకుంటూ జనరల్ క్రైంతోపాటు, సైబర్ క్రైంపై సుమారు 11 లక్షల మందికి చైతన్యం కలిగించేలా కృషి చేశారు.

'సైబర్' నియంత్రణతో మొదలుపెట్టి..

సైబర్ నేరగాళ్ల బారిన పడి ప్రజలు మోసపోతున్న వైనాన్ని జిల్లాకు వచ్చిన కొత్తలోనే ఎస్పీ జగదీష్ గమనించారు. దీనికి చెక్ పెట్టాలని భావించారు. నగరాలు, పట్టణాల్లో ప్రజలకు సైబర్ మోసాలపై కొంత అవగాహన ఉంటుంది. అదే గ్రామీణ ప్రజల్లో ఉండే అవకాశం తక్కువ. అందుకే వారికి సైబర్ మోసాలపై అవగాహన కల్పించడానికి అడుగులు వేశారు. ఎస్‌బీఐ సహకారంతో మూడు డిజిటల్ వాహనాల ను తెప్పించారు. వాటికి 'సైబర్ సురక్ష' పేరుతో ప్రత్యేకంగా సిద్ధం చేయించారు. వాటిలో డిజిటల్ స్క్రీన్లు పెట్టించి, సైబర్ నేరాలు ఎలా జరుగుతాయి...?. వాటి నుంచి మనం ఎలా రక్షించుకోవచ్చు అనే కంటెంట్‌తో 20 నుంచి 30 నిమిషాల నిడివి ఉన్న వీడియోలు ప్రదర్శింపజేశారు. ఈ వాహనాలను ప్రతి పల్లెకు పంపి గ్రామీణ ప్రజల కు అవగాహన కల్పించారు. ఫిబ్రవరిలో మొదలు పెట్టిన ఈ సైబర్ సురక్ష వాహనాలు జిల్లా వ్యాప్తంగా ఉన్న 42 పోలీస్‌స్టేషన్ల పరిధిలో తిరిగాయి. ప్రతి స్టేషన్ పరిధిలోని ప్రధాన పల్లెలన్నీ చుట్టేశాయి. సైబర్ నేరగాళ్ల నుంచీ వచ్చే లింక్స్ ఓపెన్ చేయకూడదని, సెల్‌ఫోన్‌కు వచ్చే ఓటీపీలు చెప్పరాదని, ఆశకు పోయి పెట్టుబడి పెట్టి మోసపోకూడదని తెలియజేసే వీడియోల ద్వారా సందేశం ఇచ్చే వీడియోలతో చైతన్యం తెచ్చారు. మన భద్రత- మన బాధ్యత అనే నినాదంతో ప్రజల్లో మార్పు తేవడానికి కృషి చేస్తున్నారు.

నేరాలకు 'అష్ట' దిగ్బంధనం వేసేలా...

ఈ సైబర్ సురక్ష కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ఎస్పీ 8 మార్గాలను ఎన్నుకున్నారు. డిజిటల్ డిస్‌ప్లే బోర్డులు పెట్టించి అవగాహన కల్పించారు. సైబర్ నేరాల పట్ల అప్రత్తంగా ఉండేలా వందలాది ఆటోల ద్వారా టామ్-టామ్ వేయించారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించే అంశాలు ఉన్న 10 వేల వరకూ క్యాలెండర్లు ముద్రించి ఆఫీసులు, కాలేజీలు, స్కూళ్లకు అందజేశారు. పోస్టర్లు ముద్రించి బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, రద్దీగా ఉండే ప్రాంతాల్లో అతికించారు. హోర్డింగ్స్ ద్వారా అవగాహన పెంచారు. సైబర్ నేరాల నియంత్రణ కోసం కెపాసిటీ బిల్డింగ్ పేరుతో పోలీసులకు శిక్షణ ఇచ్చారు. విద్యార్థుల్లో చైతన్యం తేవాలని ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు సుమారు 1200మందిని సైబర్ వలంటీర్లుగా రిజిస్ట్రేషన్ చేయించి భాగస్వాములను చేశారు. వారి ద్వారా మరో 15 వేల మందికి సమాచారం చేరేలా అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్ల వలలో పడే రిటైర్డ్ ఉద్యోగులు, బ్యాంకు ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులకు అవగాహన క్యాంపులు పెట్టించారు. జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో 'సైబర్ సురక్ష యాప్' తయారు చేసించి మహిళా సంరక్షణ కార్యదర్శులతో ఇంటింటికి వెళ్లి మహిళలు, యువతుల్లో అవగాహన పెంచేలా చేశారు.



డిజిటల్ స్క్రీన్ ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్న సురక్ష వాహనం

ప్రతి పల్లెకు సొంత 'సురక్ష' వాహనం

సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు చేసిన ప్రయోగం విజయవంతం కావడంతో నిత్యం జరిగే నేరాలపై కూడా ప్రజల్లో చైతన్యం తేవాలని జిల్లా పోలీస్‌శాఖ తరఫున ఎస్పీ శ్రీకారం చుట్టాడు. అదానీ సిమెంట్స్ సంస్థ సీఎస్ఆర్ కింద ఒక వాహనాన్ని పోలీసుశాఖకు అందించింది. దాన్ని 'సురక్ష' వాహనంగా మార్పు చేయించారు. చోరీలు, మహిళలు, పిల్లలపై దాడులు, అఘాయిత్యాలు, సైబర్ నేరాలు వంటివి ఎలా జరుగుతాయి...? వాటి బారిన పడకుండా ఎలా రక్షించుకోవాల నే అంశాలపై వీడియోలు తయారు చేయించారు. ఆ సురక్ష వాహనం లో ఒక డ్రైవర్, ఆపరేటర్‌ను అందుబాటులో ఉంచి జిల్లాలోని అన్ని మండలాల్లో గ్రామాలకు వాహనాన్ని తిప్పుతూ డిజిటల్ స్ర్కీన్ల ద్వారా ప్రజల్లో అవగాహన పెంచారు. ఈ ఏడాది ఏప్రిల్ 7న ఈ 'సురక్ష' వాహనాన్ని ఎస్పీ జగదీష్ ప్రారంభించారు. అక్కడి నుంచి ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పల్లెల్లో, స్కూళ్లు, కళాశాలలు, ప్రజలు రద్దీగా ఉండే కూడళ్లు, సర్కిళ్లలో డిజిటల్ స్ర్కీన్ల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 23 స్టేషన్ల పరిధిలో సుమారు 1,50,000 లక్షల మంది ప్రజలకు ఆ సందేశం చేరేలా పోలీసు శాఖ కృషి చేసింది. ఎప్పీ జగదీష్ తీసుకున్న నిర్ణయాల వల్ల డిజిటల్ పోలీసింగ్ విధానం ద్వారా నేరం, ఘోరం జరగక ముందే అప్రమత్తమయ్యే అవకాశం ప్రజలకు కలిగింది.

పల్లెసీమల్లో ప్రత్యేక వాహనాలతో అవగాహన

» నేరాల నియంత్రణకు నూతన ఆలోచన

» సాధారణ నేరాలతోపాటు సైబర్ క్రైంపై ప్రచారం

» లక్షల మందికి చేరిన పోలీసుల ప్రచార కార్యక్రమాలు



సురక్ష వాహనం



సైబర్ నేరాలపై అవగాహన కోసం ఆటోల ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ జగదీష్



అప్రమత్తం చేయడమే లక్ష్యం

జిల్లా ప్రజల్లో నేరాలు, వాటి తీరు, జాగ్రత్త పడటం ఎలా అనే అంశాలపై అవగాహన, చైతన్యం తేవడం కోసమే 'సైబర్ సురక్ష', 'సురక్ష' అనే ప్రత్యేక వాహనాలతో డిజిటల్ క్యాంపెయిన్ నిర్వహిస్తు న్నాం. మొదట సైబర్ నేరాల నుంచి ప్రజలను అప్రమత్తం చేయడానికి 'సైబర్ సురక్ష' పేరుతో మూడు వాహనాల ద్వారా జిల్లావ్యాప్తంగా అవగాహన కల్పించాం. సత్ఫలితాలు రావడంతో సురక్ష అనే మరో వాహనంతో ప్రతి స్టేషన్ పరిధిలోని రద్దీ ప్రాంతాలు, స్కూళ్లు, కళాశాలల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. నేరాలు జరిగిన తర్వాత రికవరీ చర్యలు తీసుకోవడం కంటే... నేరాల బారిన ప్రజలు పడకుండా ఉండేలా చేయడమే ధ్యేయంగా డిజిటల్ రూపంలో అవగాహనా కార్యక్రమాలతో ముందుకు వెళ్తున్నాం. -జగదీష్, ఎస్పీ, అనంతపురం



నేరాల నియంత్రణకు రన్ ఫర్ అనంత కార్యక్రమంలో ఎస్పీ జగదీష్

న్యూస్ బాక్స్

జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపిక



ఎంపికైన ధర్మవరం క్రీడాకారులతో కోచ్ హుస్సేన్

ధర్మవరం, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): హాకీ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 12 నుంచి 22వ తేదీ వరకు పంజాబ్ రాష్ట్రం జలంధర్‌లో జరుగుతున్న 15వ జాతీయ స్థాయి జూనియర్ హాకీ పోటీలలో ధర్మవరం పట్టణానికి చెందిన షేక్‌మహబూబ్‌బాషా, వనం నవీన్ కుమార్ ఎంపికైనట్టు హాకీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు బంధనాథం సూర్యప్రకాశ్ తెలిపారు. ఏప్రిల్ నెలలో ధర్మవరంలో జరిగిన 15వ రాష్ట్రస్థాయి జూనియర్ హాకీ పోటీలలోసత్యసాయి జిల్లా హాకీ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించి ప్రతిభ కనబరచి జాతీయస్థాయి జట్టుకు ఎంపికయ్యారన్నారు. రాష్ట్ర జట్టుకు కోచ్‌గా సత్యసాయి జిల్లా క్రీడాసాధికార సంస్థ హాకీకోచ్ హుస్సేన్ వ్యవహరిస్తున్నారన్నారు. ఎంపికైన క్రీడాకారులను హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బీవీ శ్రీనివాసులు, గౌరవాధ్యక్షులు బండి వేణుగోపాల్, పల్లెం వేణుగోపాల్, ముఖ్యులు రాము, గౌరీప్రసాద్, మహమ్మద్ అస్లాం, రాఘవేంద్ర, అంజన్న, అరవిందగౌడ్, చందు, మారుతి, ఇర్షాద్, అమునుద్దీన్, కిరణ్ అభినందించారు.

కోర్టు క్యాంపస్‌లో వైద్య శిబిరం



మందులు తీసుకుంటున్న కోర్టు సిబ్బంది

కదిరిలీగల్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. కదిరి ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ సిబ్బంది, వైద్యులు క్యాంపులో పాల్గొన్నారు. న్యావాదులు, న్యాయవాద గుమస్తాలు, వివిధ కోర్టుల సిబ్బంది పరీక్షలు చేయించుకున్నారు. షుగర్, బీపీ, రక్తపరీక్షలు, జ్వరం, తలనొప్పి, కీళ్ల నొప్పులు తదితర సాధారణ జబ్బులను పరీక్షించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. శిబిరాన్ని న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చౌడప్ప పర్యవేక్షించారు.

క్రీడాసామగ్రి వితరణ



క్రీడాసామగ్రిని అందజేయడానికి సిద్ధంగా ఉంచిన దృశ్యం

నల్లమాడ, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొన్నికోట జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు పెద్దప్పయ్యనాయుడు శుక్రవారం క్రీడా సామగ్రి వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్ క్రీడలకు అవసరమైన వస్తువులను అందించామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ప్రశంసాపత్రం



మంత్రి, కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న చందన

గాండ్లపెంట, ఆగస్టు15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మలమీదపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని చందనకు మంత్రి సవిత, కలెక్టర్ టీఎస్ చేతన్ చేతుల మీదగా శుక్రవారం పుట్టపర్తిలో అందుకున్నట్లు ప్రధానోపాధ్యాయుడు కె.హైదర్‌వలీ తెలిపారు. నేషనల్ హెల్త్ మిషన్, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పొగాకు వాడకానికి వ్యతిరేకంగా సంతకాలు సేకరించి, అవగాహన కల్పించిన చందనకు ప్రశంసా పత్రం, ల్యాప్‌టాప్‌ను మంత్రి, కలెక్టర్ అందించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓలు క్రిష్ణానాయక్, శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు హైదర్‌వలీ, ఉపాధ్యాయులు సునిల్, కరుణాకర్, శ్రీనివాసులు విద్యార్థినిని అభినందించారు.

పొగాకును వ్యతిరేకిస్తూ సంతకాల సేకరణ

నంబులపూలకుంట, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): పొగాకు వాడకానికి వ్యతిరేకంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులతో శుక్రవారం ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సంతకాలు చేయించారు. వీరిలో ఎక్కువ సంతకాల సేకరించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మోహన్‌రెడ్డి, పీడీ సందీప్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

నల్లమాడ, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని బస్టాండ్ కూడలిలో శుక్రవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం నిర్వహించారు. మహిళల కోసం ఉచిత బస్సులు ప్రారంభించిన సందర్భంగా వారు ఆనందం వ్యక్తం చేశారు. నల్లమాడలో ఆర్టీసీ బస్సు ఎదురుగా సీఎం చిత్రాపటానికి పాలాభిషేకం చేసి, మిఠాయిలు పంచారు. మొదట సర్కిల్‌లోని సత్యమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బుట్టి నాగభూషణనాయుడు, కొక్కంటి మంజునాథ్‌రెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, పూల రామయ్య, విశ్రాంత ఉపాధ్యాయులు లక్ష్మయ్య, అబ్బాస్‌ఖాన్, మణికుమారి, అగ్గిరాముడు, మహిళలు పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు, మహిళలు

వాడవాడలా మువ్వన్నెల జెండా రెపరెపలు



కదిరి కోర్టులో జెండా ఎగురవేస్తున్న న్యాయాధికారి జయలక్ష్మి, డిగ్రీ కళాశాలలో ఎమ్మెల్యే కందికుంట, మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ దిల్షాద్ ఉన్నీసా, ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీఓ వీవీఎస్ శర్మ

(న్యూస్ నెట్‌వర్క్-ఆంధ్రజ్యోతి)

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం వాడవాడలా మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలతో పాటు రాజకీయ పార్టీ కార్యాలయాల్లో అధికారులు, నాయకులు త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి స్వాతంత్రోద్యమ ఘట్టాలను నెమరువేసుకున్నారు. కదిరి కోర్టు ఆవరణలో సీనియర్ న్యాయాధికారి ఎస్. జయలక్ష్మి పతాకావిష్కరణ గావించి వందన స్వీకారం చేశారు. కడప డీఎల్‌ఎస్‌ఏ బాబా ఫక్రుద్దీన్, స్థానిక న్యాయాధికారి లోకనాథం, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చౌడప్ప, న్యాయవాదులు, గుమస్తాలు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ పాలు పంచుకోవాలని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు. పట్టణంలోని డిగ్రీ కళాశాల, ఫుర్కానీయా మదరసాలో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రస్తుతం యువత విద్యలో వస్తున్న మార్పులకు అనుగుణంగా నేర్చుకోవాలన్నారు. నేర్చుకున్నది నలుగురికి అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్మిత, అధ్యాపకులు పాల్గొన్నారు. ధర్మవరం పట్టణంతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ మహేశ్, డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ హేమంత్‌కుమార్, వన్‌టౌన్, టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో నాగేంద్రప్రసాద్, రెడ్డప్ప, మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మీ, ఎన్జీఓ కార్యాలయంలో ఎన్జీఓ తాలూకా అధ్యక్షుడు శంకర, ప్రభుత్వాస్పత్రిలో సూపరింటెండెంట్ తిప్పేంద్రనాయక్, ఆర్టీఓ కార్యాలయంలో ఆర్టీఓ రాణి, ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలలో ప్రశాంతి, వనితావాణి జెండావిష్కరించారు. మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ వ్యక్తిగత కార్యాలయం వద్ద అనుచరులు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. కొత్తచెరువు మండల పలుచోట్ల జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. పుట్టపర్తిలో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ సువర్ణ, జిల్లాజూనియర్ సివిల్ కోర్టులో న్యాయాధికారి సయ్యద్ ముజీబ్ పసవల, మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ ఓబులపతి, టీడీపీ కార్యాలయంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ జాతీయజెండాను ఎగురవేశారు. తాడిమర్రి, ముదిగుబ్బ, బత్తలపల్లి, కదిరి, నల్లచెరువు, నల్లమాడ, గాండ్లపెంట, అమడగూరు, ఓబుళదేవరచెరువు, బుక్కపట్నం తదితర మండలాల్లో త్రివర్ణ పతాకాన్ని అధికారులు, నాయకులు ఎగురవేశారు.



పుట్టపర్తిలో జెండాను ఆవిష్కరిస్తున్న న్యాయాధికారి సయ్యద్ ముజీబ్ పసవల, టీడీపీ కార్యాలయంలో మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి



ధర్మవరం, పుట్టపర్తిలో ఆర్డీఓలు మహేశ్, సువర్ణ జెండా ఆవిష్కరణ



బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, కొత్తచెరువులో జాతీయ నాయకుల వేషధారణలో చిన్నారులు

నీట మునిగిన మగ్గాలు

చేనేత కుటుంబాలకు బియ్యం పంపిణీ చేసిన ఎంపీ బీకే, శ్రీరామ్

ధర్మవరం, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలైన ఇందిరమ్మకాలనీ, సత్యసాయినగర్‌లో చేనేత కుటుంబాల ఇళ్లలోకి నీరు మగ్గాలు మునిగిపోయాయి. శుక్రవారం నష్టపోయిన కుటుంబాలను హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పరామర్శించారు. నీటమునిగిన మగ్గాలను పరిశీలించి వారి సమస్యలను అడిగితెలుసుకున్నారు. మగ్గంపై ఉన్న వార్పు, సప్పూరి, జరీ, నిత్యావసర సరుకులు పూర్తిగా నీటమునిగిపోయాయని చేనేత కార్మిక కుటుంబాలు వాపోయాయి. ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని నాయకులు భరోసా ఇచ్చారు. ఈ విషయంపై కలెక్టర్‌కు విన్నవించామని పరిటాల శ్రీరామ్ అన్నారు. అనంతరం తాత్కాలిక భృతికింద ఒక్కో కుటుంబానికి 10 కిలోల చొప్పున బియ్యం అందజేశారు. మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో మాట్లాడి ప్రభుత్వం నుంచి త్వరగా పరిహారం వచ్చేవిధంగా కృషిచేస్తామని తెలిపారు. వారి వెంట ఏపీసీడ్స్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, నియోజకవర్గ క్లస్టర్‌ఇన్‌చార్జ్ చింతలపల్లి మహేశ్‌చౌదరి, నాయకులు పరిశే సుధాకర్, ఫణికుమార్, నాగూర్‌హుస్సేన్, పెద్దన్న, పురుషోత్తంగౌడ్, ప్రసాద్‌నాయుడు, షరీఫ్, మాధవరెడ్డి పాల్గొన్నారు.



మగ్గాలను పరిశీలిస్తున్న ఎంపీ బీకే, పరిటాల శ్రీరామ్

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



గెలుపొందిన జట్లు

కదిరిఅర్బన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురష్కరించుకుని పట్టణంలోని ఎస్‌టీఎస్‌ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో కదిరి డివిజన్‌లోని ఉపాధ్యాయులకు స్నేహపూర్వక క్రికెట్ టోర్నమెంటు నిర్వహించారు. అందులో భాగంగా నాలుగోరోజు శుక్రవారం మొదట అమడగూరు, నల్లమాడ జట్లు తలపడ్డాయి. ఈ పోటీల్లో అమడగూరు జట్టుపై నల్లమాడ జట్టు విజయం సాధించింది. మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్‌గా నాగరాజు ఎంపికయ్యారు. రెండో పోటీలో నల్లచెరువు జట్టుపై తనకల్లు జట్టు గెలుపొందగా, మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్‌గా కుళ్లాయి నాయక్ ఎంపికయ్యారు. మూడో పోటీలో ఓడీసీ జట్టుపై కదిరి జట్టు విజయం సాధించింది. మ్యాన్‌ఆఫ్‌దిమ్యాచ్‌కు భార్గవ్ ఎంపికయ్యారు. విజేత జట్లను ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభినందించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ తాహేర్‌వలీ, వైఎస్ఆర్‌టీఎఫ్ గంగాధర్‌రెడ్డి, పీడీఎస్‌ఈఏ లస్కర్‌నాయక్, ఎస్‌టీయూ రామమోహన్, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు శ్రీనివాసులు, ఆజాం, అశ్వర్థ, మనోహర్, వెంటనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా విద్యార్థులకు ప్రోత్సాహకాలు

కదిరిఅర్బన్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాలలో గత యేడాది పదో తరగతిలో ప్రతిభకబరచని విద్యార్థులకు శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రోత్సాహక బహుమతులు అందించారు. 1973-74 పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో బహుమతులు పంపిణీ చేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన నౌమాన్‌కు రూ.5వేలు, రెండో స్థానం అతీఫ్ రూ.3వేలు, మూడో స్థానంలో ఎస్.అనిల్‌కుమార్‌నాయక్ రూ.రెండువేలతోపాటు మెమెంటోలు అందించి, అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అత్తార్ మహబూబ్ బాషా, ఎల్ రెడ్డి, ఎస్ఎండీ బాషా, కాటం వీరనారాయణ, రామలింగయ్య, రమేష్‌బాబు, అజంతుల్లా, ప్రధానోపాధ్యాయులు లియాకత్‌అలీ, టీడీపీ నాయకులు కేఎస్ బాహుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందచేస్తున్న పూర్వ విద్యార్థులు

టీడీపీ అంటేనే మహిళా పక్షపాతి

స్త్రీశక్తి పథకం ప్రారంభోత్సవంలో ఎంపీ బీకే, పరిటాల శ్రీరామ్



ధర్మవరంలో స్త్రీశక్తి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ బీకే పార్థసారథి, పరిటాల శ్రీరామ్, కదిరిలో మహిళకు ఉచిత టిక్కెట్ ఇస్తున్న ఎమ్మెల్యే కందికుంట

ధర్మవరం, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అంటేనే మహిళా పక్షపాతి అని స్త్రీశక్తి పథకం ద్వారా మరోసారి నిరూపితమయిందని హిందూపురం ఎంపీ బీకే పార్థసారధి, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌లు పేర్కొన్నారు. ధర్మవరం ఆర్టీసీ బస్టాండ్‌లో స్త్రీశక్తి పథకాన్ని వారు శుక్రవారం జెండా ఊపి ప్రారంభించారు. దీంతో ధర్మవరంలో పండుగ వాతావరణం నెలకొంది. అనంతరం ఆర్టీసీ బస్సులో మహిళలతో కలిసి బీకే, శ్రీరామ్ ప్రయాణించారు. అనంతరం ఎంపీ బీకే మాట్లాడుతూ.. రాష్ట్రం ఆర్థికంగా కష్టాల్లో ఉన్నా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్ని పథకాలు అమలుచేస్తున్నారని అన్నారు. స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఎక్కడికైనా ప్రయాణించవచ్చన్నారు. శ్రీరామ్ మాట్లాడుతూ... ఆ రోజు ఆస్తిలో సమాన హక్కు కల్పించింది టీడీపీ నేని, అదే స్ఫూర్తితో సీఎం చంద్రబాబు మహిళా పక్షాన నిలబడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఏపీసీడ్స్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, క్లస్టర్‌ఇన్‌చార్జ్ మహేశ్‌చౌదరి, నాయకులు సుధాకర్, ఫణికుమార్, నాగూర్‌హుస్సేన్, పెద్దన్న, పురుషోత్తంగౌడ్, ప్రసాద్ నాయుడు, షరీఫ్, మాధవరెడ్డి, శీన, ఆది, ఆనందరెడ్డి పాల్గొన్నారు.

మహిళలకు ఆర్థిక తోడ్పాటు : ఎమ్మెల్యే కందికుంట

● కదిరి: మహిళలకు ఆర్థిక తోడ్పాటును అందించేందుకే ప్రభుత్వం స్త్రీశక్తి పథకాన్ని ప్రారంభించిందని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో స్త్రీశక్తి పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్త్రీశక్తి పథకం ద్వారా రాష్ట్రంలో మహిళలు ఎక్కడికైనా ప్రయాణించవచ్చన్నారు. ప్రతి మహిళ ఈ పథకాన్ని ఉపయోగించుకోవాలన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఆది నుంచి తోడ్పాటు అందించి టీడీపీనే అన్నారు. డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలను ఆర్థిక స్వావలంబన అందించామన్నారు. స్త్రీశక్తి పథకం ద్వారా ఉద్యోగాలు, వ్యాపారాలు చేసే మహిళలు, విద్యార్థినులకు ఆర్థిక వెసులుబాటు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో వీవీఎస్ శర్మ, డీఎం మైనోద్దీన్, మున్సిపల్ చైర్‌పర్సన్ దిల్షాదున్నీసా, మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారధి, టీడీపీ నాయకులు పవన్‌కుమార్‌రెడ్డి, పర్వీనాభాను, బాహుద్దీన్, నాగేంద్ర, మేడా శంకర్, బీజేపీ గంగాధర్, జనసేన భైరవ ప్రసాద్, శివశంకర్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

● కొత్తచెరువు : ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని, దీంతో వైసీపీ నాయకుల గుండెల్లో గుబులుపుట్టుకుందని టీడీపీ హిందూపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి సాలక్కగారి శ్రీనివాసులు పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఉచిత బస్సును ఆయనతోపాటు కూటమి నాయకులు ప్రారంభించారు.



కొత్తచెరువులో ఉచిత బస్సును ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

'హాస్టల్‌ను కదిరికి తరలిస్తాం'

తనకల్లు, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): తనకల్లులో మూసేసిన బాలికల వసతి గృహాన్ని కదిరికి తరలిస్తామని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికార అధికారి రాజేంద్రకుమార్ రెడ్డి ఒక తెలిపారు. మండల కేంద్రమైన తనకల్లులోని బీసీ బాలికల వసతి గృహాన్ని మూసేశారు. దీనిపై బుధవారం ఆంధ్రజ్యోతిలో 'హాస్టల్ మూసేశారు..' అనే శీర్షికతో కథనం ప్రచురితమయింది. దీనిపై ఆయన వివరణ ఇచ్చారు. విద్యార్థులు లేకపోవడంతో హాస్టల్‌ను మూసివేసినది నిజమేనని, గత యేడాది హాస్టల్‌లో ఉన్న విద్యార్థుల ఆధారంగా బియ్యం సరఫరా జరిగిందన్నారు. సిబ్బందికూడా అక్కడే ఉన్నారని, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌తో చర్చించి హాస్టల్‌ను కదిరికి తరలించడానికి జిల్లా కలెక్టర్‌కు నివేదికలు పంపామని తెలిపారు. కలెక్టర్ నుంచి అనుమతులు రాగానే తనకల్లులోని బీసీ బాలికల హాస్టల్‌ను కదిరిలో నిర్వహిస్తామన్నారు. బియ్యాన్ని కదిరికి తరలించి, సిబ్బందిని కూడా అక్కడికే బదిలీ చేస్తామన్నారు.

సామూహిక వరలక్ష్మీ వ్రతం



ఆంజనేయస్వామి ఆలయంలో వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహిస్తున్నమహిళలు

ధర్మవరం, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కార్యసిద్ధి వీరాంజనేయస్వామి ఆలయంలో దాన ధర్మచారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీవ్రతాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీరాంజనేయస్వామికి ప్రత్యేక అలంకరణచేసి పూజలు చేశారు. మహిళలకు ట్రస్టు తరఫున చీర, అమ్మవారి పూజ నాణ్యం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు జల్లాకార్తీక్, ధనుంజయ్ పాల్గొన్నారు.

పాఠశాలకు సామగ్రి పంపిణీ

ధర్మవరంరూరల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ధర్మవరం శాఖ ఐడీబీఐ బ్యాంకు సౌజన్యంతో శుక్రవారం రావులచెరువు జడ్పీ పాఠశాల విద్యార్థులకు రూ.1.75లక్షల విలువచేసే సామగ్రిని అందజేశారు. ఐడీబీఐ బ్యాంకు అధికారులు బాలమురుగం, శ్యామ్‌సుందర్, రామ్, నాగభూషణం, శ్రీనివాసులు పాఠశాలకు వెళ్లి బెంచీలు 18, క్లాస్‌టేబుల్స్ 5, ఆఫీసుటేబుల్ 1, చైర్లు 5, కంప్యూటర్ టేబుల్, ప్రింటర్, పుస్తకాలు పంపిణీ చేశారు. బ్యాంకు సిబ్బందిని ఉపాధ్యాయులు అభినందించారు.



బెంచీలు అందించి ప్రారంభిస్తున్న ఐడీబీఐ బ్యాంకు సిబ్బంది

బైక్ అదుపు తప్పి వ్యక్తికి తీవ్రగాయాలు

కొత్తచెరువు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్ర సమీపంలోని నాగులకనుమ వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో హమాలీ రాజకుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...రాజ్‌కుమార్ పుట్టపర్తి నుంచి ద్విచక్రవాహనంలో కొత్తచెరువు వస్తుండగా మార్గమధ్యంలో నాగులకనుమ వద్దకు రాగానే బైకు అదుపు తప్పి కిందకు పడ్డాడు. ప్రమాదంలో రాజ్‌కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.



గాయపడిన రాజ్‌కుమార్

న్యూస్ బాక్స్

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం



పూజలో పాల్గొన్న మహిళలు

లేపాక్షి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): శ్రావణశుక్రవారం సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీవ్రతం ఆచరించారు. అమ్మవారి ప్రతిమను ప్రత్యేకంగా అలంకరించి విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవారికి తాంబూలం, ఫలపుష్పాలతో ప్రత్యేక పూజలు చేశారు. ముత్తైదువులను ఆహ్వానించి గాజులు, వస్త్రాలు, ప్రసాదాలను అందించారు.

తుమ్మల మారెమ్మకు ప్రత్యేక పూజలు



గుడిబండ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెలసిన తుమ్మ ల మారెమ్మ అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

పాఠశాలకు బీరువా వితరణ



పాఠశాలకు బీరువాను అందజేస్తున్న లక్ష్మీనారాయణరెడ్డి

పెనుకొండ రూరల్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రగిరి గ్రామంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి పాఠశాలకు బీరువాను వితరణ చేశారు. రూ.10వేలు విలువచేసే బీరువాను అందించారు. సింగిల్‌విండో అధ్యక్షుడు పోతిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు బావయ్య, ఎస్‌ఎంసీ చైర్మన్ విశ్వనాథ్ పాల్గొన్నారు.

డీసీసీ బ్యాంకు డైరెక్టర్ పదవికి నామినేషన్



నామినేషన్ దాఖలు చేస్తున్న జేడీఎస్ అభ్యర్థి ఈరన్న

పావగడ, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): తుమకూరు జిల్లా కేంద్ర సహకార డీసీసీ బ్యాంక్ ఎన్నికలకు సంబంధించి పావగడ నుంచి జేడీఎస్ అభ్యర్థిగా ఈరన్న శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. 16వరకు నామినేషన్లకు అవకాశం. 17న పరిశీలన 18న నామినేషన్ల ఉపసంహరణ, 24న ఎన్నికలు జరగనున్నాయి. అదేరోజు ఫలితాలు వెలువడనున్నాయి. కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ ఇదివరకే డీసీసీ బ్యాంక్ డైరెక్టర్‌కు నామినేషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

అన్నదానం



అన్నదానం చేస్తున్న మిత్ర బృందం

గోరంట్ల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన టీడీపీ కార్యకర్త రఘు(30) మృతిచెందడంతో అతని జ్ఞాపకార్థం మిత్రులు శుక్రవారం అన్నదాన చేశారు. బూత్ కోకన్వీనర్‌గా పనిచేస్తున్న రఘు 4వ తేదీన గుండెపోటుతో మృతిచెందారు. దశదినం సందర్భంగా మృతుడి స్నేహితులు కలిసి బస్టాండ్ కూడలిలో అన్నదానం చేస్తూ, స్నేహబంధానికి ఉన్న గొప్పతనాన్ని చాటి చెప్పారు.

త్యాగధనుల పోరాట ఫలితమే స్వాతంత్ర్యం

● జెండా పండుగలో ఎమ్మెల్యే బాలకృష్ణ



జెండా వందనం చేస్తున్న ఎమ్మెల్యే

హిందూపురం, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): ఎంతో మంది మహానుభావుల ప్రాణత్యాగాల ఫలితమే మనకు స్వాతంత్ర్యమని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. శుక్రవారం 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంజీఎం క్రీడా మైదానంలో జాతీయ జెండా ఎగురవేశారు. విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్ల గౌరవ వందనం స్వీకరించారు. శాంతి కపోతాలు ఎగురవేశారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించారు. దీప్తి పాఠశాల విద్యార్థులు చేసిన ఓ పాట, సైనికుల సన్నివేశంచూసి చలించి వారికి సెల్యూట్ చేశారు. విద్యార్థులకు బహుమతులు అందించారు. ఆయన మాట్లాడుతూ బ్రిటీష్‌వారు మన దేశ సంపదను దోచుకెళ్లారని దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతోమంది ప్రాణాలు ఒడ్డారన్నారు. వారిని స్మరించుకోవాలన్నారు.

పోలీసు వ్యవస్థ పటిష్టంగా ఉండాలన్నదే ధ్యేయం

పోలీస్ వ్యవస్థ పటిష్టంగా ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బాలకృష్ణ అన్నారు. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌వద్ద పోలీస్ కమాండ్ కంట్రోల్‌రూమ్‌ను ఆయన ప్రారంభించారు. డీఎస్పీ మహేష్, సీఐలు రాజగోపాల్‌నాయుడు జనార్దన్, కరీం బాలకృష్ణను సన్మానించారు. పట్టణంలో 200సీసీ కెమెరాలకు సహకరించడంతోపాటు ఓ దాత నుంచి 150కెమెరాలు బాలకృష్ణ ఇప్పించారు. రూ.6లక్షలు సొంతంగా ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ లాఅండ్‌ఆర్డర్ పటిష్టంగా ఉన్నప్పుడే శాంతి భద్రతలు బాగుంటాయన్నారు.

వినాయక నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించండి

వినాయక చవితిని పురస్కరించుకుని ఏర్పాటుచేసే విగ్రహాలు గుడ్డం కోనేరువద్ద నిమజ్జనం చేస్తారు. అక్కడ వసతులు సరిగాలేకపోవడంతో అహుడా నిధుల కింద రూ.1.5కోట్లు ఖర్చుచేసి గుడ్డం కోనేరును అభివృద్ధి చేసేందుకు భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ వినాయక నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించాలన్నారు.

పురం అభివృద్ధికి సీఎం ముందుంటారు

హిందూపురం నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుంటారని బాలకృష్ణ పేర్కొన్నారు. విలేకరులతో మాట్లాడుతూ హిందూపురం నియోజకవర్గం అభివృద్ధిలో వేగం పుంజుకుంటుందన్నారు. బంగారు హిందూపురం కావడంలో ఎంతో దూరంలేదన్నారు. అంతర్జాతీయ విమానాశ్రయం దగ్గరగా ఉండటంతో నియోజకవర్గం అభివృద్ధిలో పరుగులు పెడుతుందన్నారు. కావాల్సినంత భూములున్నాయని రైతులు కూడా పరిశ్రమల ఏర్పాటుకు సహకరిస్తున్నారన్నారు. వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. హిందూపురంలో రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని అదేవిధంగా తూమకుంట పారిశ్రామికవాడలో ఈఎస్‌ఐ ఆసుపత్రిలో రింగురోడ్డు నిర్మాణానికి డీపీఆర్ సిద్ధం చేయాలని కేంద్ర మంత్రి అధికారులకు సూచించారన్నారు. జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, అహుడా చైర్మన్ వరుణ్, టీడీపీ జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప, మునిసిపల్ చైర్మన్ రమేష్, మునిసిపల్ కమిషనర్ మల్లికార్జున, టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ అశ్వర్థనారాయణరెడ్డి, పట్టణ కన్వీనర్ వెంకటేశ్, జనసేన ఇన్చార్జ్ ఉమేష్, నాయకులు ఆనంద్, నాగరాజు, మహేష్, మంగేష్, పరిమళ, డైమండ్‌బాబా, తదితరులు పాల్గొన్నారు.



సైనికుడి వీరమరణం ఘట్టాన్ని ప్రదర్శిస్తున్న దీప్తి పాఠశాల విద్యార్థులు

బస్సు బాగా నడిపానా?

శ్రీశక్తి పథకం ప్రారంభించి ఆర్టీసీ బస్సును బస్టాండు నుంచి ఎమ్మెల్యే కార్యాలయం వరకు బాలకృష్ణనే నడిపారు. బాలకృష్ణ కొంత వేగంగా నడపడం, టర్నింగ్‌లో కట్‌చేయడంతో బస్సులో ఉన్న మహిళలు, టీడీపీ నాయకులు ఉలిక్కిపడ్డారు. అనంతరం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద మహిళలతో ముచ్చటించారు. బస్సు బాగా నడిపాను కదా అంటూ అనడంతో మహిళలు అవునన్నారు. కానీ నేను డ్రైవ్ చేస్తానంటే తన భార్య కూడా వాహనం ఎక్కదని గుర్తుచేశారు.



బస్సును నడుపుతూ..

స్వాతంత్ర్య సమరయోధుల పోరాటాలు స్ఫూర్తిదాయకం: ఎమ్మెల్యే



జెండా వందనం చేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, అధికారులు నాయకులు

మడకశిరటౌన్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధులు చేసిన పోరాటాలు ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకం అని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అన్నారు. శుక్రవారం 79వ స్వాతంత్ర్య వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఉదయం క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలిసి బాలాజీ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో జెండాను ఆవిష్కరించారు. అక్కడి నుండి తహసీల్దార్, సబ్‌రిజిస్ట్రార్, నగర పంచాయతీ కార్యాయాలు, జూనియర్, ఒకేషనల్ కళాశాలలు, ఉన్నత పాఠశాలలో జాతీయ జెండాను ఎగురవేశారు. రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, నగర పంచాయతీ చైర్మన్ నరసింహరాజు, పట్టణ అధ్యక్షుడు నాగరాజు, కమిషనర్ జగన్నాథ్, సీఐ నగేష్‌బాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి హామీని నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం



బస్సు సర్వీసును ప్రారంభించి ప్రయాణిస్తున్న ఎమ్మెల్యే

మడకశిరటౌన్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీల్లో భాగంగా ప్రతిపథకాన్ని నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అన్నారు. ఆయన శుక్రవారం పట్టణంలోని జ్యోతిబాపూలే విగ్రహం వద్ద స్త్రీశక్తి పథకాన్ని ప్రారంభించారు. గుండుమల తిప్పేస్వామితో కలిసి ఆయన మహిళలతో కలిసి ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో అనేక కార్యక్రమాలు ప్రవేశ పెడుతున్నట్లు తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, నగర పంచాయతీ చైర్మన్ నరసింహరాజు, వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణతోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి కార్యాలయంలో...



శాంతి కపోతాన్ని ఎగురవేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత తన కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. శుక్రవారం ఆమె శాంతి కపోతాలను ఎగురవేసి దేశ నాయకుల త్యాగాలను స్మరించుకున్నారు. షౌకత్, నారాయణస్వామి, పోతిరెడ్డి, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, బీజేపీ రామక్రిష్ణ, జనసేన కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

మడకశిరటౌన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి క్రీడాకారుడు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అన్నారు. శుక్రవారం జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన టీ-20 లెదర్‌బాల్ టోర్నీ ముగింపు కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఫైనల్‌లో పెనుకొండ కిమాల్‌జట్టుపై హిందూపురం జట్టు విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన హిందూపురం జట్టు 185 పరుగులు సాధించగా అనంతరం బ్యాటింగ్ చేసిన పెనుకొండ కిమాల్‌జట్టు 144 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. విజేతగా నిలిచిన హిందూపురం జట్టుకు రూ.15వేలు, పెనుకొండ జట్టుకు రూ.10వేలు అందించారు. అనంతరం మెమెంటోలను విజేతలకు అందజేశారు. అభిమన్యు యూత్ అసోసియేషన్ కార్యదర్శి నాగేంద్ర, పట్టణ అధ్యక్షుడు నాగరాజుతోపాటు పలువురు నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రతిభా విద్యార్థులకు ఆర్థిక సాయం

అగళి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేసినట్లు హెచ్‌ఎం మస్తాన్‌సాబ్ తెలిపారు. ఆగస్టు 15న పాఠశాలలో చదివిన విద్యార్థులకు అధిక మార్కులు సాధించినవారికి షీల్డ్, ప్రశంసాపత్రంతోపాటు ఆర్థిక సాయం అందజేయడం ఆనవాయితీ. ఇందులో భాగంగా దీపక్‌నాయక్ మొదటి స్థానం రూ.10వేలు, యాసీన్ రెండో స్థానం రూ.7వేలు, సుల్తాన్‌ఖాన్ మూడో స్థానం రూ.5వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేకాతిలో ప్రబలిన విషజ్వరాలు

● మంచానపడ్డ ప్రజలు ● వైద్యశిబిరం ఏర్పాటు



పారిశుధ్య పనులు చేయిస్తున్న వైద్య సిబ్బంది

గుడిబండ, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేకాతి గ్రామంలో ప్రజలు విషజ్వరాలతో మంచానపడ్డారు. 30 మంది దాకా విషజ్వరాలు సోకడంతో చికిత్సల కోసం ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. గ్రామంలో చెత్తాచెదారం పేరుకుపోవడంతోపాటు వర్షం నీరు నిలువ ఉండటంతో రోగాలు ప్రబలుతున్నాయని వాపోతున్నారు. అధికారులు వెంటనే చర్యలు చేపట్టి విషజ్వరాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వైద్య సిబ్బంది అప్రమత్తం: గ్రామంలో వైద్యాధికారి శ్రీనివాస నాయక్ ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. విషజ్వరాలు సోకినవారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు, మాత్రలు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి చక్రవర్తి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

రోడ్డు విస్తరణకు మార్కింగ్

గోరంట్ల, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కమ్మవారిపల్లికి వెళ్లే రహదారిని విస్తరించడానికి పంచాయతీ సిబ్బంది, టీడీపీ నాయకులు శుక్రవారం మార్కింగ్ వేశారు. గోరంట్ల నుంచి ఎర్రయ్యగారిపల్లి మీదుగా పెడబల్లి వరకు ఆర్‌అండ్‌బీ రహదారిని డబుల్‌రోడ్డుకోసం చాలావరకు పనులు పూర్తి అయ్యాయి. పట్టణంలోని గాంధీ సర్కిల్ నుంచి టీటీడీ కళ్యాణమండపం వరకు ఇళ్ల నిర్మాణాలతో రోడ్డు ఇరుకుగా ఉండడంతో ఆర్‌అండ్‌బీ అధికారులు పనులు చేయకుండా ఆపివేశారు. మంత్రి సవిత ఆదేశాల మేరకు సర్పంచ్ భర్త నాగేనాయక్, కన్వీనర్ బాలక్రిష్ణచౌదరి, నిమ్మల విద్యాధరణి ఆధ్వర్యంలో రోడ్డు విస్తరణకు శ్రీకారం చుట్టారు. పంచాయతీ సిబ్బంది ద్వారా రోడ్డు మధ్య నుంచి ఇరువైపులా 20 అడుగుల వెడల్పుతో ఇళ్ల నిర్మాణంపై మార్కింగ్ వేశారు. విస్తరణకు స్థానికంగా సుముఖత వ్యక్తమవుతున్నా కొంతమంది పట్టణంలోని హిందూపురం, కదిరి, ప్రధాన రహదారిని వదిలి చిన్నరోడ్లను విస్తరించడం ఏమిటని విమర్శిస్తున్నారు. నిరంతరం భారీ వాహనాలు వెళ్లే ప్రధాన రహదారిని ఎందుకు విస్తరించడం లేదని ప్రశ్నిస్తున్నారు.



మార్కింగ్ వేసిన పంచాయతీ సిబ్బంది

ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం



జెండా వందనం చేస్తున్న డీఎస్పీ మహేష్

హిందూపురం, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలపై జెండాను ఆవిష్కరించారు. కోర్టు ఆవరణంలో న్యాయమూర్తులు కంపల్లె శైలజ, రమణయ్య, భారతి పాల్గొన్నారు. డీఎస్పీ కార్యాలయంవద్ద డీఎస్పీ మహేష్ జెండా ఆవిష్కరించారు. తహసీల్దార్ కార్యాలయంవద్ద తహసీల్దార్ వెంకటేశ్ జెండాను, వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో అశ్వత్థనారాయణరెడ్డి, ఎంపీడీఓ సరస్వతి జెండా ఆవిష్కరించారు. మునిసిపల్ కార్యాలయంలో చైర్మన్ రమేష్ జెండా ఎగురవేశారు.



కోర్టు ఆవరణలో..



చిలమత్తూరు: మండల వ్యాప్తంగా స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరిగాయి. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయా సంబంధిత అధికారులు జాతీయ జెండాను ఎగురవేశారు. తహసీల్దార్ కార్యాలయంలో డీటీ జగన్నాథం, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రమణమూర్తి జెండాను ఎగురవేశారు.



గోరంట్ల: మండలవ్యాప్తంగా స్వాతంత్ర్య దినోత్సవాన్ని ప్రభుత్వ కార్యాలయాలు, యూనివర్సిటీ, కళాశాలలు, పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మారుతి, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ ప్రమీల, ఎంపీడీవో నరేంద్రకుమార్, పోలీస్‌స్టేషన్‌లో సీఐ శేఖర్, మేజర్ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సరోజ, టీడీపీ కన్వీనర్ బాలక్రిష్ణచౌదరి, డిప్యూటీ ఎంపీడీఓ దేవదానం, పార్టీనాయకులు, ఆజాదీక అమృత్ మహోత్సవ్ కమిటీ ఆధ్వర్యంలో త్రివర్ణపతాకం ఎగువరచేసి, వందనం చేశారు. ఉర్దూ ఉన్నతపాఠశాలలో 150మంది విద్యార్థులకు టీడీపీ నాయకులు అజంతుల్లా స్టీల్ వాటల్ బాటిల్స్‌ను అందజేశారు.



పెనుకొండ: పెనుకొండలో వాడవాడలా స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకున్నారు. స్థానిక సరస్వతి విద్యామందిరంలో కమిటీ సభ్యులు బక్సంపల్లి రామక్రిష్ణ, సుధాకర్‌గుప్త, వేదవ్యాస్, నామామురళి, ముఖ్య అతిథులు భవానీశంకర్, కామేశ్వరి దంపతులు, హెచ్‌ఎం పద్మజ, చలపతిరావు హాజరై జెండా ఆవిష్కరించారు. వివిధ కార్యాలయాలు, పాఠశాలల్లో స్వాతంత్ర్య వేడుకలు జరుపుకున్నారు. కోర్టు ప్రాంగణంలో న్యాయమూర్తులు సీనియర్‌సివిల్ న్యాయాధికారి వాసుదేవన్, జూనియర్ సివిల్ న్యాయాధికారి మసాల బుజ్జప్ప, జూనియర్ అడిషనల్ సివిల్ న్యాయాధికారి రాజేష్ పతాకావిష్కరణ చేశారు.



పరిగి: మండంకేంద్రంలోని కొడిగెనహళ్లి పద్మసాయి పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా విద్యార్థులు వివిధ వేషధారణలతో ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కరస్పాండెంట్ శ్రీధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రొద్దం: మండలంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌ఉదయ్ శంకర్ రాజు జెండాను ఆవిష్కరించారు. పోలీస్‌స్టేషన్, ఎంపీడీఓ, ఐకేపీ, ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలల్లో జాతీయ జెండాను ఎగురవేశారు. టీడీపీ, సింగిల్‌విండో కార్యాలయంలో అధ్యక్షుడు, నాయకులు జెండా ఎగురవేశారు.



జాతీయ నాయకుల వేషధారణలో చిన్నారులు

పెనుకొండ రూరల్: స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకుని మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో అంగనవాడీ కేంద్రాలు, జాతీయ జెండాను ఎగురవేశారు. ఆయా సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో జెండాను ఎగురవేశారు.

సోమందేపల్లి: స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలల్లో జెండా ఎగురవేసి గౌరవవందనం చేశారు. స్వాతంత్ర్య సమరయోధులను వారి త్యాగాలను స్మరించుకున్నారు. జామియా మసీదు తరుపున ముస్లింలు 650అడుగుల జాతీయ పతాకాన్ని పురవీధులగుండా ప్రదర్శించారు.



650 అడుగుల జెండాను ప్రదర్శిస్తున్న ముస్లింలు

లేపాక్షి: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద మువ్వెన్నెల జెండా రెపరెపలాడింది. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంవద్ద తహసీల్దార్ సౌజన్యలక్ష్మీ జాతీయజెండాను ఆవిష్కరించారు.



పావగడ: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శుక్రవారం మహాత్మగాంధీ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ వరదరాజు, ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ జాతీయ జెండాను ఆవిష్కరించి తాలూకా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.